Office : 9440815774

మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

వ్యవస్థాపకులు : డి.విజయ్‌కుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : తిరుపతి - చిత్తూరు | సంపుటి : 02 | సంచిక : 69 | ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | బుధవారం 14 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 2

## 2.2 కిలోమీటర్ల నాలుగు లేన్ల

# రహదారి

- 'వాయుపుత్ర మార్గ్'ను ప్రారంభించిన పవన్‌కల్యాణ్
- బైపాస్ రోడ్డును వర్చువల్‌గా ప్రారంభించిన పవన్‌కల్యాణ్
- “రోడ్డుకు సంబంధించిన విషయం మా దృష్టికి రాగానే, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.8.91 కోట్ల వ్యయంతో రోడ్డు పనులను చేపట్టాం.



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లాలో రూ. 8.91 కోట్ల వ్యయంతో 2.2 కిలోమీటర్ల మేర నిర్మించిన నాలుగు లైన్ల రహదారిని వర్చువల్ విధానంలో ప్రారంభించి, దానికి 'వాయుపుత్ర మార్గ్' అని నామకరణం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప - మిగతా3లో



## లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే

- చైనా వాదనలకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్
- లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమేనని భారత్ మరోసారి స్పష్టం చేసింది
- చైనా వైపు నుంచి ఎన్ని తిరస్కరణలు వచ్చినా ఆ వాస్తవాన్ని మార్చలేవని గట్టిగా సమాధానం ఇచ్చింది.
- “భారత్ తీసుకున్న ఈ చర్య చట్టవిరుద్ధం
- చైనా- భారత్ సరిహద్దులోని పశ్చిమ భాగం చైనాకు చెందినది అనే వాస్తవాన్ని ఇది మార్చదు.

## నిరుద్యోగులకు

# గుడ్ న్యూస్



- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీ సర్కారు
- ఆంధ్రప్రదేశ్‌లో 2,721 టీచర్ పోస్టులకు షార్ట్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- సాధారణ పాఠశాలల్లో 2,111, ప్రత్యేక విద్యలో 350 పోస్టుల భర్తీకి ప్రకటన
- మూడు వారాల్లో పూర్తిస్థాయి నోటిఫికేషన్ జారీ చేయనున్న విద్యాశాఖ
- డిసెంబర్ 2026లో ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహించే అవకాశం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మొత్తం 2,721 టీచర్ పోస్టుల భర్తీ కోసం జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) షార్ట్ నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలోని వేలాది మంది అభ్యర్థులలో కొత్త ఉత్సాహం నెలకొంది. 2026 అక్టోబర్ 13న విడుదలైన నోటిఫికేషన్ ద్వారా సాధారణ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) కేటగిరీలలో 2,111 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటితో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో - మిగతా3లో



## దేశ ప్రజలంతా మాతో ఉన్నారు

- జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు: రాహుల్
- రాహుల్ గాంధీ నివాసంలో 'ఇండీ' కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులకు తేనీటి విందు ఏర్పాటు
- “మేమంతా ఇక్కడ ఏకతాటిపై, ఒక్కటిగా నిలబడి ఉన్నాం
- నేను సోమవారం చెప్పినట్లు సమాంతరంగా నిరసనలు ఏమీ లేవు

## రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ ఛైర్మన్లకు

# రిజర్వేషన్లు ఖరారు

- పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ఉత్తర్వులు జారీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు గణనీయమైన ప్రాధాన్యత
- త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు మార్గం సుగమం
- రాజకీయ పార్టీలలో మొదలైన జడ్పీ పీఠాల సమీకరణాలు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల రాజకీయాలు కీలక దశకు చేరుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లా పరిషత్ (జడ్పీ) ఛైర్మన్ పదవులకు ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ మంగళవారం అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లా పరిషత్‌లది అత్యంత కీలకమైన పాత్ర. ఈ నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ల ఖరారుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. జనాభా ప్రాతిపదికన, రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు రిజర్వేషన్లు కేటాయించడం ద్వారా సామాజిక న్యాయం పాటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మొత్తం 28 స్థానాల్లో సామాజిక వర్గాల వారీగా చూస్తే, షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) 5 స్థానాలు, షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) 3, వెనుకబడిన తరగతులకు (బీసీ) 6 స్థానాలు దక్కాయి. - మిగతా3లో



## దేశ ప్రజలంతా మోదీ, ఎన్డీఏ వైపే

- వరుసగా నాలుగోసారీ కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయం
- రాష్ట్రాలు, ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుస ఓటములు తప్పట్లేదని అమిత్ షా
- గుజరాత్, బంగాల్, తమిళనాడు, యూపీలో కాంగ్రెస్ దారుణ పరాజయం పొందింది
- ఈ ఓటములకు ఎన్నికల సంఘాన్ని నిందించవద్దు

## చెన్నైకి తాగునీరు

# ఇవ్వండి

- ఉండవల్లిలో ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం
- చెన్నై తాగునీటి అవసరాల కోసం అదనపు జలాలు కోరిన సీఎం విజయ్
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించిన చంద్రబాబు
- నీటి లభ్యతను బట్టి సాయం చేస్తామని చంద్రబాబు హామీ
- ఇప్పటికే చెన్నైకి 4.08 టీఎంసీలు విడుదల చేశామని వెల్లడి
- ప్రధాని మోదీ నాయకత్వంలోనే ఐదు నదుల అనుసంధానం సాధ్యమని వెల్లడి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

లతమ రాష్ట్ర రాజధాని చెన్నై నగరం ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశంపైనే చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి - మిగతా3లో

## శబరిమలలో ఫొటోగ్రఫీ, డ్రోన్లపై బ్యాన్

- రోడ్ల పక్కన వంటపైనా నిషేధం
- శబరిమల మండల-మకరవిళక్కు సీజన్ నేపథ్యంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డ్రోన్లపై నిషేధంతో పాటు మాంసాహారం, హోటళ్లపైనా ఆంక్షలు విధించింది.
- సన్నిధానంలోని నలంబలం లోపల భక్తులు విచ్చలవిడిగా కెమెరాలు, మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల దర్శనానికి తీవ్ర ఆటంకం



## మండల పరిషత్ బరిలో
# యువతకు అవకాశం కల్పించాలి!

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు కర్లగట్ట యూనిట్ ఇన్‌చార్జి గిరిధర్ విజ్ఞప్తి

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 13:**



రాబోయే మండల పరిషత్ ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యం కల్పించి, పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కర్లగట్ట యూనిట్ ఇన్‌చార్జి గిరిధర్ కోరారు. ఈ మేరకు ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిసి తన విజ్ఞప్తిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై, స్థానిక సమస్యలపై అవగాహన కలిగి, పార్టీ కోసం చురుగ్గా పనిచేస్తున్న యువ కార్యకర్తలను గుర్తించి ఎన్నికల్లో అవకాశం కల్పించాలని గిరిధర్ కోరినట్లు తెలిపారు. యువతకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు, భవిష్యత్తులో సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రజాసేవపై ఆసక్తి, నాయకత్వ లక్షణాలు కలిగిన యువతకు ప్రాధాన్యం ఇస్తే స్థానిక సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు తగిన అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు గిరిధర్ వెల్లడించారు.

# టీడీపీ నాయకుడి మృతితో విషాదం

**కుటుంబాన్ని పరామర్శించిన : ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి**



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 13:**

పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రామప్ప మృతి పట్ల పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామప్ప సోమవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్టణ టీడీపీ నాయకులతో కలిసి గడ్డూరుకు వెళ్లి రామప్ప భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్వీ బాలాజీ, గిరిబాబు, నాగరాజు, కృష్ణమూర్తి గౌడ్, మదన్, లోకేష్, శ్రీనివాసులు, చెన్నరాయప్ప, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సేవా పోర్టల్‌లో నిలిచిపోయిన సేవలను పునరుద్ధరించాలి

**ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి మీ సేవా నిర్వాహకుల వినతి**



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 13:**

మీ సేవా,ఏపీ సేవా పోర్టల్లలో నిలిపివేసిన కీలక సేవలను పునరుద్ధరించేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని మీ సేవా నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం నాయకులు పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాల రీప్రింట్, వాటర్ ట్యాక్స్ చెల్లింపులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల తమ సేవా కేంద్రాల నిర్వహణ, జీవనోపాధిపైనా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన అమరనాథరెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మీ సేవా సంఘం నిర్వాహకులు రెడ్డిప్రసాద్, భాస్కర్, చింటూ, బాబు తదితరులు ఉన్నారు.

## కోదండ రామాలయంలో
# కళ్యాణ మండపం మంజూరు చేయండి

**సీఎం చంద్రబాబుకు ఆర్ఎస్ మణి వినతి.. ఎంపీపీ అవకాశం కల్పించాలని అభ్యర్థన**

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 13:**



కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం మంజూరు చేయాలని, రాబోయే మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని రాళ్లబూదుగూరు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్‌మణి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయంలో కళ్యాణ మండపం నిర్మిస్తేపేద, మధ్యతరగతి కుటుంబాలకు వివాహాల నిర్వహణలో ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు. అలాగే పార్టీ కోసం పనిచేసిన తన సేవలను గుర్తించి ఎంపీపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఆర్ఎస్ మణి తెలిపారు.

## వెంకటేగౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన సుధాకర్ రెడ్డి

**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 13:**



పలమనేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ్‌ను చిత్తూరుజిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వి.కోటకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుధాకర్ రెడ్డి, వెంకటేగౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి వెంకటేగౌడ్ చేసిన కృషి అభినందనీయమని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని, ఈ నియామకంతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. **కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు :** మాజీ జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కే. యువరాజ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వెంకటేగౌడ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండి
# లక్ష్య సాధనకు కృషి చేయాలి

● మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయి..

● విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

● ఫ్రెషర్స్ డేలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపు

**గంగవరం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్13:**





విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ చూపాలని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి సూచించారు. చెడు అలవాట్లకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది వంటిదని, ఈ సమయంలో కష్టపడి చదువుకోవడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలతో పాటు కుటుంబాలపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. యువత వాటికి దూరంగా ఉండి చదువు, లక్ష్య సాధనపై దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు కూడా అవసరమని తెలిపారు. విద్యార్థులు టెక్నికల్ కోర్సులు అభ్యసించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పలమనేరు ప్రాంతం భవిష్యత్తులో ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెరిగే వీలుందని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులు ఇప్పటి నుంచే అవసరమైన నైపుణ్యాలను సాధించుకోవాలని అన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమతో లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 43 మందికి రూ.12.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**హిందూపురం ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేత**

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 13:**



హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు ఆయన కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 43 మంది లబ్ధిదారులకు రూ.12,30,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేవినహల్లి ఆనంద్, కన్వీనర్లు ప్రెస్ వెంకటేష్, రాము, అభి, రామాంజీ, పరిమళ, చెన్నమ్మ, శ్రీదేవితో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి అభివృద్ధికి నూతన రహదారులు

**తుడా ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు శ్రీకారం**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 13:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా తుడా నిధులతో చేపట్టనున్న నూతన రహదారుల నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వర్చువల్‌గా పనులను ప్రారంభించగా, మంగళవారం తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్. గోవిందరావు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, తుడా పరిధిలోని అన్ని నియోజకవర్గాల సమాన అభివృద్ధికి కృషి చేస్తున్నామని, రహదారుల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పనులను నిరంతరం పర్యవేక్షించి, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని తుడా వైస్ చైర్మన్ ఆర్. గోవిందరావు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తుడా అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నూతన డీఎస్పీ బి. పావనికి ఎమ్మార్పీఎస్ నాయకుల సత్కారం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 13:**

శ్రీకాళహస్తి నూతన డీఎస్పీగా నియమితులైన బి.పావనిని ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి శేషవస్త్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ల రాజా మాదిగ, ఎమ్మార్పీఎస్ శ్రీకాళహస్తి నియోజకవర్గ యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్ మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ శ్రీకాళహస్తి రూరల్ మండల అధ్యక్షులు యువరాజు మాదిగతో పాటు నాయకులు యాసారుపు ప్రసాద్ మాదిగ, గంగలపూడి రమేష్ బాబు మాదిగ, బుడంగుంట సంతోష్ మాదిగ, నల్లిపాకు మునేంద్ర మాదిగ, రావినూతల మదన్ మాదిగ, గాదిపాకుల నాగరాజు మాదిగ, నపిర్ల బాలరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చదవండి.. చదివించండి

చిత్తూరు ఎక్స్‌ప్రెస్

## రాష్ట్రస్థాయి టెన్నిస్‌లో సత్తా చాటిన ఎంజీఎం విద్యార్థి

**జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు అర్హత**




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 13:**

శ్రీకాళహస్తి రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల కు అర్హత సాధించిన శ్రీకాళహస్తిలోని ఎంజీఎం జూనియర్ కళాశాల విద్యార్థి ఉమర్ అక్మల్‌ను ఎంజీఎం ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీమతి గుడ్లూరు ఐశ్వర్యలక్ష్మి అభినందించారు.అండర్–19 విభాగంలో టెన్నిస్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఉమర్ అక్మల్, ఈ నెల 23న జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు అర్హత సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్యలక్ష్మి మాట్లాడు తూ, తమ విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ఉమర్ అక్మల్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.ఎస్.రత్నం, విద్యార్థి ఉమర్ అక్మల్, అతని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడులో రూ.21.70
# లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 13:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి అన్నారు. మంగళవారం మండల అధ్యక్షుడు రావెళ్ల మునిరాజు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.21,70,528 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు.ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.24 వేల నుంచి రూ.2.50 లక్షల వరకు చెక్కులు అందజేశారు. బసవయ్యపాలెం, పెద్ద కన్నలి, పూడి, కాసరం, చియ్యవరం, చేమూరు తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఈ సాయం పొందారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి మురళి నాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి, కొన్నలి రమేష్, ఉన్నం ప్రసాద్ నాయుడు, శంకర్ నాయుడు, కొర్రపాటి వాసునాయుడు, లెక్కల మురళి నాయుడు, బాలాజీ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు చందు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మార్కొండయ్యకు అండగా ఉంటాం

**ప్రమాదంలో గాయపడిన మార్కొండయ్యకు డాక్టర్ హరికృష్ణ పరామర్శ**



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్13:**

ప్రమాదంలో గాయపడిన ఎస్ఆర్ పురం మండలం కటికపల్లి మాజీ సర్పంచ్ మార్కొండయ్యను వైఎస్సార్‌సీపీ నాయకుడు,మాజీ మంత్రి కుతూహలమ్మ తనయుడు డాక్టర్ హరికృష్ణ మంగళవారం పరామర్శించారు. మార్కొండయ్య నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మాజీ సర్పంచ్ డిల్లయ్య,కొత్తపల్లి వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పవన్ బిగ్‌బాస్,డీఎస్ బాబు,ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చెన్నైకి తాగునీరు ఇవ్వండి

**సీఎం చంద్రబాబు**

-మొదటిపేజీ తరువాయి

విజయ్‌కు, ఆయన వెంట వచ్చిన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చెన్నై నగర తాగునీటి అవసరాలను తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింతగా సహకరించాలని సీఎం విజయ్ అభ్యర్థించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో జలాల లభ్యత గణనీయంగా తగ్గి, ఏపీలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ, పొరుగు రాష్ట్ర దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఇప్పటికే ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు చంద్రబాబు వివరించారు. భవిష్యత్తులో ప్రాజెక్టులలో నీటి లభ్యత, అవసరాలను బేరీజు వేసుకుని, మరికొంత నీటిని విడుదల చేసే అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని ఆయన విజయ్‌కు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు ఆవశ్యకతను చంద్రబాబు నొక్కి చెప్పారు. ఈ బృహత్తర పథకం రెండు రాష్ట్రాలకే కాకుండా దేశానికే మేలు చేస్తుందని ఆయన వివరించారు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు ద్వైపాక్షిక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.

**దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది:**

తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రాకతో విజయవాడ నగరం దద్దరిల్లిపోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్‌తో కలిసి ఆయన వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ఉద్విగ్నంగా ప్రసంగించారు. దుర్గమ్మ, భారత్ మాత, తెలుగు తల్లికి జయజయధ్వానాలు పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, సభకు హాజరైన యువత ఉత్సాహాన్ని చూసి పులకించిపోయారు. "విజయ్ రాకతో మీ ఉత్సాహం చూస్తుంటే విజయవాడ దద్దరిల్లిపోతోంది" అంటూ సభికులను ఉత్తేజపరిచారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దళపతి విజయ్ మొట్టమొదటిసారిగా మరో రాష్ట్రానికి వచ్చారని, ఆ గడ్డ పవిత్రమైన విజయవాడ కావడం, దుర్గమ్మ తల్లే ఆయన్ను ఇక్కడికి పిలిపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. తమిళనాడును అభివృద్ధి చేయాలనే బలమైన పట్టుదలతో, కేవలం రెండేళ్లలోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి విజయ్ అని కొనియాడారు. ఆయన పట్టుదల, అంకితభావం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు జాతీయ రాజకీయాలు, నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రాలు వేరు కావచ్చు, కానీ మా అందరి అభిమతం ఒకటే. భారతదేశం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలు బాగుండాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని చెబుతూ, గోదావరి–కావేరి నదుల అనుసంధానం త్వరలోనే జరుగుతుందని ప్రకటించారు. "దుర్గమ్మ తల్లి సాక్షిగా, మన విజయవాడ నుంచే గోదావరి, కృష్ణమ్మ తల్లులు కలుస్తాయి. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చగల ఏకైక నాయకుడు నరేంద్ర మోదీ" అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు అనుసంధానమై నాలుగు రాష్ట్రాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు. వేదిక కింద ఉన్న యువతను, వారి ఉత్సాహాన్ని చూస్తుంటే భారతదేశ భవిష్యత్తుపై తనకు సంపూర్ణ విశ్వాసం కలుగుతోందని చంద్రబాబు అన్నారు. "టెక్నాలజీ, నాలెడ్జ్‌తో భారత యువత ప్రపంచంలో ఏదైనా సాధించగలదు. మీ ఉత్సాహం చూశాక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌కు ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని, విజయవాడ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు ఆ ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. అనంతరం, వెండితెరపై కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రసంగించవలసిందిగా చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు.

# అభ్యర్థుల ఎంపికపై పూర్తి స్థాయిలో ఫోకస్



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకోవడంతో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేలా బలమైన నేతలను బరిలోకి దించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, సీనియర్ నాయకులతో అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థుల ఎంపికను వీలైనంత త్వరగా పూర్తి చేసి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేయాలని జగన్ భావిస్తున్నారు. స్థానిక సమరంలో అందరికంటే ముందే అభ్యర్థులను ప్రకటించి సైకలాజికల్ అడ్వాంటేజ్ దక్కించుకోవాలనే వ్యూహంతో వైఎస్సార్‌సీపీ ఉంది. ఇందులో భాగంగానే ఇప్పటికే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా సీనియర్ నేత ఆనం విజయ్‌కుమార్ రెడ్డి పేరును వైఎస్ జగన్ అధికారికంగా ఖరారు చేశారు. రిజర్వేషన్ల సమీకరణాలను బేస్ చేసుకుని రేపు జరగబోయే రీజనల్ కోఆర్డినేటర్ల సమావేశంలో మిగిలిన ప్రధాన నగరాల మేయర్ అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాజకీయంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన కీ–కార్పొరేషన్లపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరగనుంది. విజయవాడ, గుంటూరు, వైజాగ్, కాకినాడ, ఒంగోలు, కడప, అనంతపురం నగరాల మేయర్ అభ్యర్థులను రేపటి సమావేశం ముగిసిన అనంతరం వైఎస్ జగన్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో బలమైన ప్రచారం సాగుతోంది. ఇప్పటికే గుంటూరు మేయర్ స్థానానికి మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె పేరు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు లీకులు వస్తుండటంతో, రేపటి అధికారిక లిస్ట్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు, అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేయాలని రీజనల్ కోఆర్డినేటర్లకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. పోలింగ్ బూత్ ల వారీగా నిఘా ఉంచడం, అభ్యర్థుల ఆర్థిక, సామాజిక బలాలను అంచనా వేయడం వంటి అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి తదితర ప్రాంతీయ సమన్వయకర్తలతో జగన్ వన్–టు–వన్ సమీక్షించనున్నారు. రేపటి ప్రకటనతో ఏపీ మున్సిపల్ ఎన్నికల రాజకీయం మరింత ఊపందుకోనుంది. రాజకీయాల్లో సామాజిక వర్గాల సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కేవలం కుల సమీకరణాలను ఆధారంగా చేసుకుని ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యం కాదు. ప్రజల్లో పలుకుబడి, స్థానిక సమస్యలపై అవగాహన, నాయకుడి బలం, పార్టీ శ్రేణులతో సంబంధాలు కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికైనా పరిగణనలోకి తీసుకోవాలనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో పార్టీ వ్యూహాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంగళగిరి నియోజకవర్గంలో జరిగిన పరిణామాలు ఈ చర్చకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. గతంలో బలమైన స్థానిక నాయకుడిగా గుర్తింపు పొందిన ఆళ్ల రామకృష్ణారెడ్డిని పక్కనపెట్టి, మురుగుడు లావణ్యకు అవకాశం కల్పించడం ద్వారా బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ భావించింది. అయితే ఎన్నికల్లో ఆమె విజయం సాధించలేకపోయారు. ఓటమి తర్వాత నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేయడంపై కూడా మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక సమీకరణాలతో పాటు అభ్యర్థి స్థానిక బలం, ప్రజలతో అనుబంధాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిణామం గుర్తుచేస్తోంది. విజయవాడ నగర రాజకీయాల్లోనూ ఇలాంటి చర్చ కనిపిస్తోంది. నగర మేయర్ పదవి విషయంలో బీసీ మహిళకు అవకాశం కల్పించాలనే నిర్ణయాన్ని వైసీపీ తీసుకుంది. ఈ క్రమంలో రాయన భాగ్యలక్ష్మి మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆమె నాయకత్వం, నగర రాజకీయాల్లో పార్టీకి వచ్చిన ప్రయోజనాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన స్థానాల్లో సామాజిక ప్రాతినిధ్యాన్ని పెంచడం ఎంత ముఖ్యమో, ఆ పదవుల్లో ఉన్నవారు ప్రజల్లో గుర్తింపు సంపాదించడం, పార్టీకి రాజకీయంగా ఉపయోగపడటం కూడా అంతే ముఖ్యమనే వాదన వినిపిస్తోంది. గత ఎన్నికల్లో విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో కూడా వైసీపీ ప్రయోగం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయాలు ఎన్నికల్లో విజయంగా మారకపోవడంతో అభ్యర్థుల ఎంపిక విధానంపై సమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం తప్పు కాదు. అయితే అభ్యర్థి సామర్థ్యం, స్థానికంగా ఉన్న బలం, ఎన్నికల నిర్వహణలో అనుభవం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం వైసీపీ ముందున్న మరో ప్రధాన సమస్య పార్టీలోని అంతర్గత విభేదాలు. కొన్ని నియోజకవర్గాల్లో సమన్వయకర్తలు, సీనియర్ నాయకుల మధ్య విభేదాలు పెరుగుతున్నాయనే చర్చ ఉంది. వీటిని పరిష్కరించకుండా వదిలేస్తే పార్టీ కేడర్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికలకు ముందే నాయకుల మధ్య సమన్వయం పెంచడం, నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేయడం అవసరం. సామాజిక సమీకరణాలు రాజకీయాల్లో ముఖ్యమైనవే అయినప్పటికీ అవే విజయానికి హామీ ఇవ్వవు. బలమైన నాయకత్వం, ప్రజలతో నిరంతర సంబంధాలు, సమర్థమైన అభ్యర్థుల ఎంపిక, అంతర్గత సమస్యల పరిష్కారం కూడా కీలకం. ఈ అంశాలపై వైసీపీ నాయకత్వం దృష్టి పెట్టకపోతే భవిష్యత్తు ఎన్నికల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. పార్టీ పునరుద్ధరణకు వ్యూహాత్మక మార్పులు ఎంతవరకు ఉపయోగపడతాయన్నది జగన్ తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

## గీత దాటే వారికి ఫైనల్ డెడ్ లైన్

**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వానికి కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలి పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు , ప్రజాప్రతినిధులకు అవినీతి రహిత, పారదర్శక పాలన అందించాలని పదే పదే దిశానిర్దేశం చేస్తున్నారు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు వ్యక్తిగతంగా పిలిపించి క్లాస్ పీకినా, హెచ్చరికలు జారీ చేసినా కొందరు నాయకులు మాత్రం తమ పాత అలవాట్లను మానుకోకపోవడం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ , పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుల వ్యవహారాలు రాష్ట్ర రాజకీయాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. అనంతపురంలో అధికారులు, వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లు, సెటిల్‌మెంట్ల ఆరోపణలు రావడంతో పాటు ఆడియో క్లిప్పులు వైరల్ కావడం స్థానికంగా కలకలం రేపింది. మరోవైపు పోలవరం నియోజకవర్గంలో ఇసుక మైనింగ్ దందాలు, దేవుడి భూముల వివాదాలు, రూ.21 లక్షల డీలింగ్స్ ఆడియో లీక్‌లతో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వార్తల్లో నిలిచారు. గతంలోనే పవన్ కళ్యాణ్ ఈయన్ను పిలిపించి హెచ్చరించినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, ఏకంగా ఓ హైలెవెల్ ఎంక్వైరీ కమిటీని నియమించి సీరియస్ యాక్షన్‌కు శ్రీకారం చుట్టారు. వీరిద్దరే కాకుండా రాయలసీమ, ఉత్తరాంధ్ర , కోస్తా జిల్లాలకు చెందిన మరికొందరు కూటమి ఎమ్మెల్యేలు కూడా అధికారులపై బెదిరింపులకు దిగడం, ఇసుక–మద్యం మాఫియాలతో చెయ్యి కలపడం, స్థానిక కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు డిమాండ్ చేయడం వంటి వివాదాల్లో చిక్కుకుంటున్నారు. మేము కష్టపడి అధికారాన్ని తెస్తే.. వీరు ఐదేళ్ల మైండ్‌సెట్‌తో దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు అని స్థానిక క్యాడర్, కూటమి శ్రేణులు సోషల్ మీడియా వేదికగా బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఎమ్మెల్యేల అతివల్ల ప్రభుత్వం కష్టపడి తెచ్చుకుంటున్న మంచి పేరు కాస్తా తుడిచిపెట్టుకుపోతోందనే ఆగ్రహం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో కూటమి అధిష్టానాలు అంతర్గత సర్వేల ద్వారా ఎమ్మెల్యేల పనితీరు, వారిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై పక్కా నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న స్పందన, సోషల్ మీడియా ట్రాకింగ్ ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్.. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదనే స్పష్టమైన సంకేతాలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల స్వేచ్ఛా దోపిడీ వల్లే ప్రజలు వారిని తిరస్కరించారనే విషయాన్ని గుర్తుచేస్తూ, పార్టీ పరువు తీసే నాయకులను దూరం పెట్టడమే మేలనే అభిప్రాయానికి వచ్చారు. ప్రస్తుతానికి మొదటి దశగా పోలవరం ఎమ్మెల్యేపై పవన్ కళ్యాణ్ కమిటీ నియామకంతో విచారణ ప్రారంభించగా, విచారణ నివేదికల ఆధారంగా అక్రమాలు రుజువైతే పార్టీ బాధ్యతల నుంచి తొలగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీడీపీలోనూ వివాదాస్పద ఎమ్మెల్యేలకు చంద్రబాబు లాస్ట్ అండ్ ఫైనల్ డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. మార్పు రాకపోతే రాబోయే రోజుల్లో వారిని శాసనసభాపక్షం నుంచి పక్కనబెట్టడం వంటి కఠిన చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమికి ఈ వివాదాస్పద ఎమ్మెల్యేల ప్రవర్తన పెద్ద పరీక్షగా మారింది. అధినేతలు కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, ఒకరిద్దరిపై బహిరంగంగా కఠిన చర్యలు తీసుకుంటేనే మిగిలిన నాయకుల్లో భయం, క్రమశిక్షణ నెలకొంటాయని సామాన్య ప్రజలతో పాటు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## 2.2 కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. నెల్లూరు జిల్లావో ఎన్‌హెచ్–67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ. 8.91 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు లైన్ల రహదారిని ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. 2.2 కిలోమీటర్ల మేర ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న ఈ రహదారికి వాయుపుత్ర మార్గ్‌గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నమైన ఈ రహదారి విస్తరణ పనులు సాకారం కావడం సంతోషకరమన్నారు.

ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతమిచ్చేందుకు రహదారి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ రహదారి సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉందని, ఈ విగ్రహం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, రహదారికి వాయుపుత్ర మార్గ్ అని నామకరణం చేస్తున్నట్లు పవన్ ప్రకటించారు. "రోడ్డుకు సంబంధించిన విషయం మా దృష్టికి రాగానే, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.8.91 కోట్ల వ్యయంతో రోడ్డు పనులను చేపట్టాం. అలాగే, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.6.31 లక్షల వ్యయంతో మొత్తం 2.2 కిలోమీటర్ల పొడవునా నాలుగు రోడ్ల విస్తరణ పనులను కూడా చేపట్టాం" –పవన్ కల్యాణ్,ఉప ముఖ్యమంత్రి

గ్రామీణ రహదారులను బలోపేతం చేసేందుకు పల్లె పండుగ కార్యక్రమం కింద 9 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించగా, మరో 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల మంజూరు చేశామని పవన్ తెలిపారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా మరో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నుంచి పాల్గొన్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు మరికొన్ని పనులకు పవన్ కల్యాణ్ నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

-మొదటిపేజీ తరువాయి

కేటగిరిలలో మరో 350 పోస్టులను, సొసైటీస్ కేటగిరీలో 260 పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పోస్టుల వారీగా ఖాళీలు, రిజర్వేషన్ల వివరాలు, ఇతర ముఖ్య సమాచారంతో కూడిన పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను మరో మూడు వారాల్లో విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే ఈ ప్రకటన వెలువడింది. పూర్తి నోటిఫికేషన్ తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

## రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ చైర్మన్లకు రిజర్వేషన్లు ఖరారు

-మొదటిపేజీ తరువాయి

మిగిలిన 14 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉంచారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, అన్ని కేటగిరీలలో కలిపి మొత్తం 14 స్థానాలను మహిళలకే కేటాయించడం విశేషం.

ఓఈ రిజర్వేషన్ల ప్రకటనతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలలో సందడి మొదలైంది. ఆయా జిల్లాల్లో రిజర్వేషన్లకు అనుగుణంగా ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయనున్నారు.

జిల్లాల వారీగా రిజర్వేషన్ల పూర్తి వివరాలు:

ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు:

తిరుపతి -- ఎస్సీ మహిళ
గుంటూరు -- ఎస్సీ మహిళ
కోనసీమ -- ఎస్సీ మహిళ
ఎన్టీఆర్ -- ఎస్సీ
ప్రకాశం -- ఎస్సీ
పోలవరం -- ఎస్టీ మహిళ
అల్లూరి సీతారామరాజు -- ఎస్టీ
పార్వతీపురం మన్యం -- ఎస్టీ

**బీసీ కేటగిరీలు:**

అనకాపల్లి -- బీసీ మహిళ
శ్రీకాకుళం -- బీసీ మహిళ
విజయనగరం -- బీసీ మహిళ
విశాఖపట్నం -- బీసీ
అనంతపురం -- బీసీ
కర్నూలు -- బీసీ

**అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలు:**

మహిళలు: కృష్ణా, పల్నాడు, తూర్పుగోదావరి, బాపట్ల, కాకినాడ, చిత్తూరు, ఏలూరు.
జనరల్: నెల్లూరు, అన్నమయ్య, మార్కాపురం, నంద్యాల, శ్రీసత్యసాయి, పశ్చిమగోదావరి, వైఎస్ఆర్ కడప.

# కూటమికి బీసీ నినాదం

**కాకినాడ:** ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కార్డు కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా అత్యంత కీలకం కానుంది. జనాభాలో సగానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులను తమ వైపు తిప్పుకునేందుకు కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తొలి నుంచి టీడీపీకి బీసీలు అండగా నిలుస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లోనూ బీసీలు కూటమి అభ్యర్థుల విజయానికి అండగా నిలిచారు. అయితే బీసీ పురుషులు యాభై ఏళ్లు నిండిన వారికి పింఛన్లు, మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న కూటమి నేతల హామీలు నెరవేరలేదు. దీంతో కొంత వెనకబడిన వర్గాల్లో అసంతృప్తి ఉంది. అయితే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో అది పెద్దగా పనిచేయదని, స్థానిక సంస్థలలో డబుల్ ఇంజిన్ సర్కార్ ను మాత్రమే చూస్తారని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల ను రాజకీయంగా కల్పించేందుకు సిద్ధమయింది.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే తమ మేనిఫెస్టో హామీకి కట్టుబడి ఉన్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. న్యాయపరమైన చిక్కులు ఎదురైనప్పటికీ, బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం, ప్రాతినిధ్యం కల్పించడమే తమ ధ్యేయమని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త కోటా లెక్కల ద్వారా స్థానిక సంస్థల్లో సుమారు 4,000 పైగా అదనపు స్థానాల్లో బీసీలకు అవకాశం లభించనుందని నివేదికలు చెబుతున్నాయి. అయితే అన్నీ బీసీ వర్గాలకు ఇస్తే మిగిలిన సామాజికవర్గాల్లో వ్యతిరేకత వస్తుందేమోనన్న అభిప్రాయం కూడా ఉంది. ఇన్నాళ్లు తాము పార్టీ కోసం పనిచేసింది పదవులు వస్తాయని, అలాంటిది రిజర్వేషన్ల పేరుతో తమను దూరం పెడితే ఎలా? అన్న ప్రశ్న కూడా వారి నుంచి వినపడుతుంది. గతంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ గత ఎన్నికల్లో తక్కువ స్థానాలకే పరిమితమయిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరియు బీసీ సంఘాలు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా నిష్పత్తికి తగ్గట్లుగా న్యాయమైన వాటా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి. కోర్టుల పరిధిలో రిజర్వేషన్ల అంశంపై జరిగిన పరిణామాలు ఓటర్లలో ఎలాంటి ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది. బీసీలను తమ సాంప్రదాయ ఓటు బ్యాంక్‌గా భావించే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి.. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆమోదంతో బీసీల నమ్మకాన్ని గెలుచుకోవాలని చూస్తోంది. ఈ 'బీసీ కార్డు' మరియు రిజర్వేషన్ల అమలు తీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయవకాశాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే బీసీ కార్డును ఉపయోగించి ఇప్పటికే జనంలోకి వెళ్లేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అది ఏ మేరకు పనిచేస్తుందన్నది చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో అత్యధిక శాతం ఓటర్లు బీసీలు ఉండటంతోవారిని ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు తమ దైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి. మరి చివరకు ఎవరిని బీసీలు కరుణిస్తారన్నది చూడాలి.

# ఢిల్లీలో కాంగ్రెస్ నేతలపై లాఠీ‌ఛార్జిను ఖండించిన పన్యాల జైపాల్ రెడ్డి

**ఎల్బీనగర్ :** ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి గాయాలు కావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీఛార్జి చేయడం ఆందోళనకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పన్యాల జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# రాజకీయాల కన్నా ప్రజా సంతృప్తి కీలకం

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ తెరపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తులు, పైఎత్తులు ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లోనూ, మైండ్ గేమ్‌లోనూ తనదైన దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్.. పాలన విషయానికి వచ్చేసరికి మాత్రం అదే స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి గట్టిగా వినపడుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో సరికొత్త సంచలనాలు వస్తాయని ఆశించిన సామాన్య ప్రజలు.. కనీసం గతంలో అందిన సంక్షేమ పథకాలైనా సక్రమంగా అందుతాయా లేదా అనే సందేహంలో పడిపోయారు.గత బీఆర్ఎస్ హయాంలో అమలులో ఉండి, ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కొన్ని పథకాలు రేవంత్ రెడ్డి పాలనలో మందగించడం, అసలు అమలు కాకపోవడం ప్రధాన విమర్శలకు దారితీస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమల్లో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో, పాత పథకాల పంపిణీలో సైతం ఆలస్యం జరగడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లభించిన రైతు బీమా పథకాలు.. కాంగ్రెస్ తెచ్చిన రైతు భరోసా పేరు మార్పుతో పాటు ఆంక్షలు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సాగులో లేని భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం కట్ చేస్తామని ప్రకటించినప్పటికీ, అసలైన రైతులకు వానాకాలం, యాసంగి పెట్టుబడి సహాయం అందించడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు , రైతు సంఘాలు మండిపడుతున్నాయి.పేద కుటుంబాల్లో పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు అందడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది అప్లికేషన్లు పెండింగ్‌లో పడిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినప్పటికీ, పాత ఆర్థిక సహాయం రూ. 1,00,116 అందించడంలోనే నత్తనడక నడవడం ఆర్థిక లోటును తేటతెల్లం చేస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక లోటు, భారీ రుణభారం కారణంగానే సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయలేకపోతున్నామని పాలకపక్షం సమర్థించుకుంటున్నప్పటికీ.. ప్రజలకు మాత్రం లబ్ధి వేగంగా అందడం లేదనేది వాస్తవం. బీఆర్ఎస్ హయాంలో లోపాలున్నప్పటికీ పథకాలు నిరంతరాయంగా అందేవని, కానీ ఇప్పుడు నిధుల కొరత సాకుగా చూపి ఆలస్యం చేస్తున్నారనే భావన పల్లెల్లో వ్యక్తమవుతోంది. రాజకీయంగా ప్రత్యర్థులను కార్నర్ చేయడంలోనూ, పట్టు నిలుపుకోవడంలోనూ నిరంతరం బిజీగా ఉంటున్న రేవంత్ రెడ్డి.. గ్రౌండ్ లెవెల్ అడ్మినిస్ట్రేషన్‌పై అదేస్థాయి దృష్టి పెట్టలేకపోతున్నారనేది ఎక్కువ మంది అభిప్రాయం. ప్రతిపక్షాలపై విమర్శలతో సమయం గడపడం కంటే, ప్రజలకు నిత్యావసరాలుగా మారిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తేనే ప్రభుత్వానికి నిజమైన దూకుడు ఇమేజ్ లభిస్తుందని అంటున్నారు.

### అన్నపూర్ణాదేవి అలంకారంలో

# దర్శనమిచ్చిన ఆరిమాని గంగమ్మ తల్లి

**తయ్యూరు పాయకట్టులో వైభవంగా దసరా ఉత్సవాలు.. భక్తులకు అన్నదానం**



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 13:**
ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు పాయకట్టు ఇలవేల్పు శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లి దసరా ఉత్సవాలు మూడో రోజు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటాచలపతి ఆచార్యులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. యాగశాలలో వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, మహాభిషేకం, అన్నపూర్ణాదేవి హోమం నిర్వహించి మంగళహారతి సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలకు పురుషోత్తం నాయుడు, రాము నాయుడు, రమేష్ బాబు, రామకృష్ణ, సిద్ధమ నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జలంధర్ నాయుడు, వైస్ చైర్మన్ వెంకటరామయ్య, ఈవో వెంకట రాయల్, ప్రధాన అర్చకులు వెంకటాచలపతి ఆచార్యులు, రాజేంద్రన్, కమిటీ సభ్యులు నీలమ్మ, గురవయ్య, అమృత చందు, జయలక్ష్మి, రాజేశ్వరి, పాయకట్టు పెద్దలు పైనేని ధనుంజయ నాయుడు, సిద్ధయ్య శెట్టి, బాలాజీ నాయుడు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

### మంథనిలో అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులు పట్టివేత

**మంథని,** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెండు చిన్న ట్రాలీలలో ఆవులను కరీంనగర్‌కు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సోమన్న, ఎండీ తుఫాన్ కలిసి 11 ఆవులను రెండు చిన్న ట్రాలీలలో కరీంనగర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకున్నారు. పట్టుకున్న ఆవులను, అలాగే నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మంథని పోలీసులకు అప్పగించారు.

# మునిసిపల్ అధ్యక్ష అభ్యర్థిగా కన్నన్...?

## అవకాశం వస్తే అభివృద్ధి సాధ్యమే









**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 13:**
రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో కుప్పం మున్సిపల్ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో కుప్పం మున్సిపల్ అధ్యక్ష పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించినట్లు ప్రచారం సాగుతుండటంతో, ఆ పదవిని ఆశిస్తున్న దళిత నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో మున్సిపల్ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న నాయకుల్లో కుప్పం కొత్తపేటకు చెందిన 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కె. కన్నన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పార్టీ కోసం చేసిన సేవలు, ప్రజలతో ఉన్న అనుబంధం, కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ ఆయనకు అవకాశం కల్పించాలని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు.

**మూడు దశాబ్దాల రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం**

కుప్పం కొత్తపేటలోని కుర్మాయిపురం ప్రాంతానికి చెందిన కుప్పుస్వామి కుమారుడు కె. కన్నన్. ఆయన తండ్రి కుప్పుస్వామి సుమారు మూడు దశాబ్దాల పాటు రాజకీయాల్లో కొనసాగుతూ వార్డు సభ్యుడిగా పలుమార్లు ప్రజల ఆదరణ పొందారని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. చిన్ననాటి నుంచి తండ్రి ప్రజాసేవను దగ్గరగా చూసిన కన్నన్‌కు కూడా సామాజిక సేవ పట్ల ఆసక్తి పెరిగింది. అదే కుటుంబానికి చెందిన ఆయన సోదరుడు కృష్ణన్ ఎంపీటీసీగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. అనంతరం కుప్పం ప్రాంతంలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 35 వేలకుపైగా ఓట్లు సాధించినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఈ రాజకీయ నేపథ్యం తన ప్రజా జీవితానికి పునాదిగా నిలిచిందని కన్నన్ అనుచరులు పేర్కొంటున్నారు.

**దళిత యువజన సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు**

2003 నుంచి ప్రజాసేవలో చురుగ్గా పాల్గొంటున్న కన్నన్, 2004లో దళిత యువజన సేవా సమితిని ప్రారంభించి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు సహాయం చేయడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై మార్గనిర్దేశం చేయడం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వర్గీయులు వివరిస్తున్నారు. ముఖ్యంగా నిరుపేద కుటుంబాల జీవనోపాధికి తోడ్పాటు అందించడంపై దృష్టి సారించినట్లు చెబుతున్నారు. సామాజిక సేవతో పాటు రాజకీయాల్లోనూ చురుగ్గా కొనసాగిన కన్నన్ వార్డు సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం కుప్పం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికలో విజయం సాధించకపోయినా ప్రజలతో సంబంధాలను కొనసాగిస్తూ సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు.

**తెలుగుదేశం పార్టీలో కీలక బాధ్యతలు**

దళితుల అభ్యున్నతి, పేద ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి వంటి అంశాలకు రాజకీయాల ద్వారా మరింతగా కృషి చేయాలనే ఉద్దేశంతో కన్నన్ తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ విస్తరణ విభాగం కుప్పం నియోజకవర్గ కమిటీలో సభ్యుడిగా ఆయనకు అవకాశం లభించింది. ఆ సమయంలో నియోజకవర్గంలోని గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తూ పార్టీ విధానాలు, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వివిధ వర్గాల ప్రజలతో సంబంధాలు పెంచుకునేందుకు ప్రయత్నించారు. 2024లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కుప్పం నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బాధ్యతల్లో భాగంగా కన్నన్‌కు 11వ క్లస్టర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి పార్టీ అధిష్టానం సూచించిన కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా తన వంతు సహకారం అందిస్తున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యాన్ని గుర్తించి ప్రశంసా పత్రాలతో అభినందించిన సందర్భాలు కూడా ఉన్నాయని వారు పేర్కొంటున్నారు.

**మున్సిపల్ అధ్యక్ష పదవిపై కన్నన్ ఆశలు**

ప్రస్తుతం కుప్పం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నాయకుల్లో కన్నన్ కూడా ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా, పార్టీ సంస్థాగత బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తిగా తనకు అవకాశం లభిస్తుందని ఆయన వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. మున్సిపల్ అధ్యక్ష పదవికి అవకాశం లభిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సహకారంతో కుప్పం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తాననే ఉద్దేశంతో కన్నన్ ఉన్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, పేద ప్రజల సమస్యల పరిష్కారం, అర్హులకు సంక్షేమ పథకాల అందజేత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. మొత్తంగా, కుప్పం మున్సిపల్ అధ్యక్ష పదవికి అభ్యర్థి ఎంపిక ఎలా ఉండబోతోందన్న అంశం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. కన్నన్‌కు పార్టీ అవకాశం కల్పిస్తుందా లేదా అన్నది అధిష్టానం నిర్ణయంపై ఆధారపడి ఉండగా, ఆయన రాజకీయ ప్రస్థానం, సామాజిక సేవా కార్యక్రమాలు, పార్టీ బాధ్యతల నిర్వహణ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.







### నారాయణవనంలో ఇంటింటా

# త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

**దసరా పండుగ సందర్భంగా ప్రచార వాహనంతో ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన**




**నారాయణవనం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 13:**
దసరా పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కుప్పం, పొదలకూరు కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి జిల్లా నారాయణ వనం పట్టణంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రచార వాహనం ద్వారా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి, ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచిం చిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాల గురించి ప్రజలకు వివరిం చారు. ఈ గ్రంథా ల్లోని ఆధ్యాత్మిక భావాలు, బోధనలను ప్రజలకు పరిచయం చేస్తూ వాటిపై అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..., త్రైత సిద్ధాంత భగవద్గీతలో జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు సంబంధించిన జ్ఞానం ప్రధానంగా వివరించబడిందని తెలిపారు. దసరా పండుగకు ఆధ్యాత్మిక కోణంలో ఉన్న అర్థాన్ని కూడా ప్రజలకు తెలియజేశారు. 'దశ' అంటే పది, 'ర' అంటే నశింపజేయడం అని గురువు గారు గ్రంథాల్లో వివరించినట్లు పేర్కొన్నారు. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలపై యోగమార్గం ద్వారా నియంత్రణ సాధించి, మొత్తం పది ఇంద్రియాలను జయించడమే దసరా పండుగ అంతరార్థమని వివరించారు. పండుగల వెనుక ఉన్న ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రజలు తెలుసుకోవడంతో పాటు భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించు కోవాలనే ఉద్దేశంతో ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహ కులు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కుప్పం,పొదలకూరు కమిటీల సభ్యులు పెంచల నరసయ్య, వెంకటేశ్వర్లు, మధు, వెంకటలక్ష్మమ్మ, బిందు, గీత, హరిత, సుష్మ, కిరణ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు తక్షణ వైద్య సేవలు

**తొలిరోజు 344 మందికి వైద్య సహాయం : స్విమ్స్ వీసీ డా.గుడారు జగదీష్**



**తిరుపతి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 13:**
శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు కాలినడకన తిరుమలకు చేరుకునే భక్తుల ఆరోగ్య భద్రతకు స్విమ్స్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాల ద్వారా భక్తులకు వైద్య సేవలు అందిస్తోంది. ఈ కేంద్రాల్లో అందుతున్న సేవలను స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ మంగళవారం శ్రీవారిమెట్టు వద్ద పరిశీలించారు. భక్తులకు అత్యవసర సమయాల్లో వెంటనే వైద్య సహాయం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో ఆక్సిజన్, ఈసీజీ యంత్రాలు, పడకలు, అవసరమైన మందులతో పాటు రెండు అంబులెన్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అవసరమైన భక్తులను మెరుగైన చికిత్స కోసం స్విమ్స్ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశామన్నారు. అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు రెండు మార్గాల్లో వైద్య సేవలు కొనసాగనున్నాయి. తొలిరోజు అలిపిరి, శ్రీవారిమెట్టు కేంద్రాల్లో కలిపి 344 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు స్విమ్స్ అధికారులు వెల్లడించారు. భక్తులకు చేసే వైద్య సేవను భగవంతునికి చేసే సేవగా భావిస్తూ,వారి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నామని డా. గుడారు జగదీష్ పేర్కొన్నారు.




Edited Printed Published & Owned by K.L.Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K L KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143, Cell : 9440815774